సాక్షి
కాకినాడ
బుధవారం । 10 । జూలై । 2024



సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి డీవీఎస్ సీతారామస్వామి (హైదరాబాద్) రూ.లక్ష విరాళాన్ని మంగళ వారం సమర్పించారు.



అన్నవరానికి రెండు కొత్త బస్సులు

అన్నవరం: సత్యదేవుని ఆలయానికి విచ్చేసే భక్తుల కోసం అన్నవరం దేవస్థానం మరో రెండు కొత్త బస్సులను కొనుగోలు చేయనుంది.

పుడమి తల్లికి పెనుభారం



ప్రతి దేశానికి జనాభా అనేది అత్యవసరం. వీరితోనే ఆ దేశ ప్రగతి ఆధారపడి ఉంటుంది. కానీ అదే జనాభా పరిమితికి మించితే అనేక అనర్థాలు కలుగుతాయి. దేశ అభివృద్ధి కుంటుపడుతుంది. ప్రజలందరికీ వసతులు కల్పించడం ప్రభుత్వానికి భారంగా మారుతుంది.

8లో

ఫీజు ఎంబ్రాస్‌మెంట్

- సర్టిఫికెట్లు రాక విద్యార్థులకు ఇబ్బందులు
- కూటమి ప్రభుత్వంలో ఒడిదొడుకులు ఆరంభం
- స్పష్టత లేని ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన పథకాలు
- గత ఐదేళ్ల కాలంలో జిల్లాలో రూ.200 కోట్ల మేర లబ్ధి

గత ప్రభుత్వం జిల్లాలో విద్యాదీవెన అందించింది ఇలా..

సంవత్సరం	విద్యార్థుల సంఖ్య	విడుదల చేసిన నిధులు (రూ.లలో)
2019–20	43,020	40,83,87,500
2020–21	43,630	45,74,42,500
2021–22	48,612	44,45,21,700
2022–23	43,630	39,61,23,400
2023–24	41,174	28,84,36,178

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): రాష్ట్రంలో ఐదేళ్ల పాటు నిశ్చితంగా ఉన్న ఉన్నత విద్యారంగం కొత్తగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో ఒక్కసారిగా ఒడిదొడుకులకు గురవుతోంది. మళ్లీ ఐదేళ్ల క్రితం నాటి కష్టాలకు బీజం పడినట్టుగా ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇంటర్మీడియెట్, డిగ్రీ, ఇంజినీరింగ్, ఐటీఐ, పాలిటెక్నిక్, పీజీ వంటి కోర్సుల ప్రవేశాలకు ఇది సీజన్. విద్యాసంవత్సరం ప్రారంభంతో జూన్ నుంచి ఆగస్టు నెల వరకూ సందడిగా ఉంటుంది. కోర్సు పూర్తి చేసిన వారు సర్టిఫికెట్లతో బయటకు వెళ్లడం లేదా పై తరగతులకు వెళ్లడం వంటివి ఉంటుంటాయి. ఈ సమయంలో కళాశాలలు మొదటి టర్మ్ ఫీజు చెల్లించాలని కోరతాయి. ఆర్థికంగా ఉన్న వారైతే ఫర్వాలేదు కానీ పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు రూ.వేలకు వేలు ఫీజులు చెల్లించడం చాలా ఇబ్బందిగా ఉంటుంది. ఈ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొనే గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతి మూడు నెలలకు ఒకసారి జగనన్న విద్యాదీవెన, ఏడాదికి హాస్టల్, మెస్ చార్జీలకు జగనన్న వసతి దీవెన వంటి పథకాల ద్వారా విద్యార్థులకు ఆర్థిక వెసులుబాటు కల్పించింది. కానీ ప్రస్తుతం వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ పథకాలకు పేర్లు మార్చింది కానీ అసలు ఇవి ఏవిధంగా అమలు చేస్తుందీ అన్న దానిపై ఇప్పటి వరకూ స్పష్టత లేదు. రాష్ట్ర వ్యాప్తంగా ట్యూషన్ ఫీజుల కింద కాలేజీ యాజమాన్యాలకు ప్రభుత్వం రూ.1,200 కోట్లు బకాయి ఉండగా అందులో కాకినాడ జిల్లాకు సంబంధించి రూ.50 కోట్ల వరకూ బకాయిలు ఉన్నాయి. దీంతో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పథకాలకు పేరు మార్చడంలో ఉన్న ఉత్సాహం నిధులు విడుదల చేయడంలో కూటమి ప్రభుత్వానికి కనబడటంలేదని పలు విద్యార్థి సంఘ నాయకులతో పాటు విద్యార్థులు ధ్వజమెత్తుతున్నారు.



పాత పద్ధతి వైపు మొగ్గు?

పేద విద్యార్థులను అత్యున్నత ప్రమాణాలు కలిగిన కళాశాలలో చదివించి వారి భవిష్యత్తుకు జగన్ ప్రభుత్వం ఉన్నత బాటలు వేసింది. చదువుల విషయంలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించింది. గత టీడీపీ ప్రభుత్వం పెట్టిన బకాయిలను వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత చెల్లించింది. పేదింట బిడ్డల విద్యను బాధ్యతగా భావించి బకాయిలు మొత్తం చెల్లించింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం విద్యార్థులకు షెడ్యూల్ ప్రకారం చెల్లించాల్సిన రీయింబర్స్‌మెంట్‌పై మౌనం వహిస్తోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మాదిరి రీయింబర్స్‌మెంట్‌ను కళాశాల ఖాతాల్లో జమ చేసే ఆలోచనలో భాగంగా 2023–24 ఏడాది బకాయిలు ఇవ్వకుండా ఉండేలా చూస్తున్నట్టు అనిపిస్తోందన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి. జూన్ నెలలో చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ వసతి దీవెన మొత్తాన్ని చెల్లించే విషయంపై ఇప్పటి వరకూ ఒక ప్రకటన కూడా చేయలేదు.



జగన్ హయాంలో ఆదాయ పరిమితి పెంపు..

కుటుంబ వార్షిక ఆదాయం గత టీడీపీ ప్రభుత్వం రూ.లక్షగా నిర్ధారిస్తే వీలైనంత ఎక్కువ మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరాలనే ఉద్దేశంతో దాన్ని జగన్ ప్రభుత్వం రూ.2.5 లక్షలకు పెంచి అన్ని వర్గాల వారికి లబ్ధి చేకూర్చింది. వసతి దీవెన పథకం ద్వారా ఐటీఐ విద్యార్థులకు రూ.10వేలు, పాలిటెక్నిక్ రూ.15వేలు, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ అభ్యర్థులకు రూ.20వేల చొప్పున అందజేసింది.

విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం తగదు



విద్యాభ్యాసం పూర్తి చేసి ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో సర్టిఫికెట్లు ఇవ్వడానికి కళాశాలలు పూర్తి ఫీజు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నాయి. దీంతో విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులకు ఉన్న బకాయిలు వెంటనే చెల్లించాలి.

– టి.రాజా, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మాజీ కార్యదర్శి

న్యాయం చేయాలి



డిగ్రీ లేదా వృత్తిపరమైన కోర్సులు పూర్తిచేసినా ఫీజు చెల్లించక పోవడంతో సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. ప్రభుత్వంతో మాకు సంబంధం లేదు, ఫీజు చెల్లించి సర్టిఫికెట్లు తీసుకెళ్లాలని యాజమాన్యాలు చెబుతున్నాయి. ప్రభుత్వం కాలయాపన చేయకుండా డబ్బు విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలి.

– సీహెచ్ సుధీర్‌కుమార్, కాకినాడ

మార్క్సిస్ట్ దృక్పథాన్ని అలవర్చుకోవాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

కాకినాడ సిటీ: విద్యార్థులు మార్క్సిస్ట్ దృక్పథాన్ని అలవర్చుకోవడం ద్వారా సమాజ హితం కోసం పాటుపడాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్ రెండోరోజు మంగళవారం నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు రాజకీయాల్లోకి రావాలని తద్వారా సమాజంలోని అవినీతి లేని రాజకీయాలు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం మతోన్మాద ధోరణితో ప్రజల మధ్యన చీలికలు తీవ్రమైన ఇబ్బందులకు గురి చేస్తోందని విమర్శించారు. ప్రతిపక్షాలు ఇండియా కూటమిగా ఏర్పడి బీజేపీ చేస్తున్న దుర్మార్గాలను పార్లమెంట్‌లో తిప్పికొడుతున్నాయన్నారు. విభజన హామీల్లో ఉన్న ప్రతి ఒక్క అంశాన్ని ఎన్డీఏ కూటమి కేంద్రం నుంచి తేవాలన్నారు. 30 వేల ఎకరాలతో సింగపూర్‌ని తలపించే రాజధాని నిర్మాణం చేస్తామని చెప్పిన టీడీపీ ప్రభుత్వం ఇప్పుడు ఎన్డీయే కూటమి అధికారంలో ఉంది కాబట్టి రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఈ శిక్షణ తరగతుల్లో భారత దేశ చరిత్ర, సంస్కృతి, వక్రీకరణ అనే అంశంపై ఇండియన్ జర్నలిస్టు యూనియన్ కార్యవర్గ సభ్యులు డి.సోమసుందర్ బోధించారు. నేటి రాజకీయాలు, ప్రత్యామ్నాయం అనే అంశంపై సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి వివరించారు. మూఢ నమ్మకాలు, సామాజిక రుగ్మతలు అనే అంశంపై పెన్మెత్స సుబ్బరాజు విద్యార్థులకు వివరించారు. విద్యార్థి దశలో ప్రతి ఒక్కరూ మూఢనమ్మకాలను విడిచి శాస్త్ర జ్ఞానంలోనే పోవాలని, ప్రతి ఒక్కరూ శాస్త్రీయజ్ఞానంతో ఆలోచించినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జాన్సన్ బాబు, శివారెడ్డి, మధు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

డయల్ యువర్ డీఎంకి 8 విజ్ఞప్తులు

కాకినాడ సిటీ: కాకినాడ ఆర్టీసీ డిపోలో మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని డీఎం ఎంవీ మనోహర్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఎనిమది మంది పాల్గొని తమ సమస్యలను వివరించారు. డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదుల, విజ్ఞప్తులపై సాధ్యా సాధ్యాలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని డిపో మేనేజర్ ఎంవీ మనోహర్ తెలిపారు. కాకినాడ–పెదపూడి, జి మామిడాడ రూట్లో బస్సులు తిప్పాలని, గురజనాపల్లి ఊరిలోకి బస్సులు నడపాలని, భానుగుడి జంక్షన్ పద్మప్రియ వద్ద బస్ షెల్టర్ కావాలని, భానుగుడి, కల్పనా సెంటర్ రద్దీగా ఉండడంతో రోడ్డు మీద బస్సులు ఆగకుండా చూడాలని విజ్ఞప్తులు వచ్చినట్లు తెలిపారు. కాకినాడ నుంచి రావులపాలెం, అమలాపురం, కోటిపల్లి, సామర్లకోట వైపు వెళ్లే అన్ని బస్సులు సేఫ్ హాస్పిటల్ రూట్ మీదుగా తిప్పి పద్మప్రియ థియేటర్ వద్ద ఆపాలని, కాకినాడ కోటిపల్లి బస్సులు సాయంత్రం సమయంలో జగన్నాథపురం బ్రిడ్జి వద్ద ఆపడం లేదని సాయంత్రం సమయంలో ఆగే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరారు. కాకినాడ నుంచి కిర్లంపూడి, గెద్దనాపల్లి మీదుగా ఏలేశ్వరానికి బస్సులు నడపాలని, కాకినాడ నుంచి ఎస్.తిమ్మాపురం రూట్లో బస్సులు తిప్పాలని విజ్ఞప్తులు వచ్చినట్లు డీఎం మనోహర్ వివరించారు.

ఇసుక దళారులను నిర్మూలించాలి

కాకినాడ సిటీ: ఉచిత ఇసుక నిర్ణయం అభాసుపాలు కాకుండా దళారీ వ్యవస్థను నిర్మూలించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు నిట్ల శ్రీను డిమాండ్ చేశారు. ఏపీ భవన్, ఇతర నిర్మాణ కార్మికుల సంఘం సీఐటీయూ అనుబంధ సంఘాల విస్తృత సమావేశం కాకినాడ కచేరిపేటలోని లక్ష్మీదాస్ భవన్‌లో ఆయన అధ్యక్షతన మంగళవారం జరిగింది. కొత్త ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను ప్రారంభించాలని, 1214 మెమోని తక్షణం రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌ల పరిహారాలను తక్షణం కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. గత ఐదేళ్లలో ప్రమాదాలు, ఇతర అనారోగ్య కారణాలతో చనిపోయిన భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. నిర్మాణ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు సిమెంటు, ఐరన్, కలప, నిర్మాణ సామగ్రి ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్మాణాలలో స్థానిక కార్మికులకే పని కల్పించేలా చర్యలు తీసుకోవడం ద్వారా కార్మిక వలసలను నిర్మూలించాలని కోరారు. కార్మికశాఖలో ఖాళీ పోస్టులన్నీ భర్తీ చేయడం ద్వారా భవన నిర్మాణ కార్మికులకు మెరుగైన సర్వీసును అందించాలని కోరారు. ఈ నెల 10వ తేదీన అన్ని మండల కేంద్రాల్లో మోదీ తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని కోరుతూ జరిగే ఆందోళనలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సంక్షేమ బోర్డు తిరిగి ప్రారంభించాలని, అన్ని యూనియన్లకు కమ్యూనిటీ భవనాల నిర్మాణాలకు ప్రభుత్వం సహకరించాలని కోరుతూ ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు సమర్పించాలని తీర్మానించారు. సీఐటీయూ నాయకులు, భవన నిర్మాణ కార్మికుల నాయకులు చెక్కల రాజ్‌కుమార్, మేడిశెట్టి వెంకటరమణ, వాసంశెట్టి వెంకటరమణ, ప్రకృతి ఈశ్వరరావు, వాకడ సురేషుణ, జీవా, సురేంద్ర, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వర్జీనియా పరుగులు

దేవరపల్లి: వర్జీనియా పొగాకు ధరకు బ్రేకులు ఉండడం లేదు. మార్కెట్ రోజురోజుకు పరుగులు పెడుతుంది. గత నెల రోజుల నుంచి పొగాకు ధరకు ఊహించని విధంగా పెరగడంతో రైతు కుటుంబాల్లో ఎన్నడూ చూడని ఆనందం కనిపిస్తోంది. మంగళవారం మార్కెట్లో కిలో గరిష్ఠ ధర రూ. 380, కనిష్ఠ ధర రూ. 235, సగటు ధర రూ. 311.19 పలకడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల ప్రారంభంలో కిలో గరిష్ఠ ధర రూ. 368 పలకగా, ఈ ధర రోజురోజుకు పెరుగుతూ మంగళవారం రూ. 380 లభించింది. పొగాకు బోర్డు రాజమహేంద్రవరం రీజియన్ పరిధిలోని దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం–1, 2 వేలం కేంద్రాల పరిధిలో ఇప్పటి వరకు 36.58 మిలియన్ల కిలోల పొగాకు కొనుగోలు చేశారు. దీని విలువ రూ. 1137 కోట్లు ఉంది. ఇప్పటి వరకు 2,97,677 బేళ్ల కొనుగోలు చేశారు.

కవి సమ్మేళనం బ్రోచర్ల ఆవిష్కరణ

అమలాపురం టౌన్: కాకినాడలోని పీఆర్ ప్రభుత్వ కళాశాలలో ఈ నెల 21న జరిగే 137వ జాతీయ కవి సమ్మేళనం బ్రోచర్లను మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ రావిలాల మహేష్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహామూర్తి మాట్లాడుతూ వేదిక అంతర్జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. అలాగే ఈ సమ్మేళనానికి రావాలని కలెక్టర్‌ను ఆహ్వానించారు.

నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్ మోహన్

అధికారులకు కలెక్టర్ సూచన

కాకినాడ సిటీ: జిల్లాలోని నిరుద్యోగ యువతకు నైపుణ్యాన్ని పెంపొందించే విధంగా శిక్షణ ఇచ్చి జిల్లాలోనే ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు వీలుగా జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులు, ఏపీఎస్ఎస్‌డీసీ, వికాస ప్రాజెక్టు డైరెక్టర్లు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.షాన్‌మోహన్ సూచించారు. మంగళవారం ఈ సంస్థల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రముఖ కంపెనీల ప్రతినిధులతో చర్చించి వారి ఉద్యోగ నియామకాలకు అనుగుణంగా కాకినాడ జిల్లాలోని నిరుద్యోగ యువతకు జిల్లాలోనే ఉపాధి అవకాశాలు కల్పించేలా చూడాలన్నారు. టీసీఎస్, టెక్ మహేంద్ర వంటి ప్రముఖ కంపెనీల అథారిటీలతో మాట్లాడి జిల్లాలోనే శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి వాటి ద్వారా నైపుణ్యాన్ని అభివృద్ధి చేయాల్సిందిగా సూచించారు. వేర్టెక్స్ ఏవియేషన్ సెంటర్స్ ద్వారా శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేసి జిల్లాలో నిరుద్యోగ యువతకు ఎయిర్ హోస్టెస్, కేబిన్ క్రూ, గ్రౌండ్ స్టాఫ్ ఉద్యోగాలకు సంబంధించి శిక్షణను ఇవ్వడం ద్వారా ఇంటర్నేషనల్ ఎయిర్‌లైన్స్‌లో ఉపాధి అవకాశాలు పొందే ఏర్పాట్లు చేయాలని ఆయా సంస్థల అధికారులను కలెక్టర్ షాన్ మోహన్ ఆదేశించారు. వికాస జిల్లా ప్రాజెక్టు అధికారి కె.లచ్చారావు, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ఆదిశేషు పాల్గొన్నారు.

రైతుబజార్లలో కందిపప్పు, బియ్యం అమ్మకాలు

కాకినాడ సిటీ: జిల్లాలోని రైతు బజార్లలో స్పెషల్ కౌంటర్ల ద్వారా కందిపప్పు, బియ్యం వినియోగదారులకు స్థిరమైన ధరలకు అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి ఎంవీ ప్రసాదు మంగళవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ మార్కెట్లలో కందిపప్పు కేజీ ధర రూ.181లు ఉండగా స్పెషల్ కౌంటర్ల ద్వారా రూ.160కు, బీపీటీ లేదా సోనామసూరి ఫైన్ రకం రైస్ బయట మార్కెట్లలో కిలో రూ.55.85 ఉందని, దీని రూ.49కి, సోనామసూరి రా బియ్యం మార్కెట్ రూ.52.40లు ఉందని, వీటిని రూ. 48 కు స్పెషల్ కౌంటర్ల ద్వారా వినియోగదారులకు అమ్ముతామన్నారు. పైన తెలిపిన ధరలకు హోల్‌సేల్ దుకాణాల నుంచి వినియోగదారులు పొందవచ్చని డీఎస్ఓ ప్రసాద్ వివరించారు. డీ మార్ట్, రిలయన్స్, స్పెన్సర్, ఉషోదయ, విశాల్ మెగా మార్ట్, విల్‌మార్ట్, మోర్, విజేత, మెట్రో వంటి పెద్ద చైను రిటైలర్లు కూడా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు అమ్మే విధంగా అంగీకరించారని ఈ అవకాశాన్ని వినియోగదారులు ఉపయోగించుకొని కందిపప్పు, బియ్యం తగ్గింపు ధరలకు కొనుగోలు చేయవచ్చన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు కాకుండా ఎవరైనా ఎక్కువ ధరలకు అమ్మకాలు నిర్వహించినా, భారత ప్రభుత్వం నిర్దేశించిన పరిమితికి మించి నిల్వలు ఎక్కువగా ఉంచినా అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్ఓ ప్రసాద్ హెచ్చరించారు.

మహిళా సమాఖ్య బలోపేతం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీరమణి

సామర్లకోట: జిల్లా మహిళా సమాఖ్య మరింత బలోపేతం కావాలని డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి అన్నారు. మంగళవారం స్థానిక టీటీడీసీలో జరిగిన జిల్లా మహిళా సమాఖ్య సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి శారీ ఎంబ్రాయిడరీపై 15 రోజుల శిక్షణను టీటీడీసీలో ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఈ మేరకు ప్రతి సభ్యురాలు 30 మంది ఉత్సాహవంతులను ఎంపిక చేయాలన్నారు. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలతో మహిళా సంఘ ప్రతినిధులు వ్యాపారవేత్తలుగా తయారు కావాలన్నారు. జిల్లాలోని మండల మహిళా సమాఖ్యలపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులు రికవరీలపై దృష్టి సారించాలన్నారు. బ్యాంకు లింకేజ్, స్త్రీ నిధి, ఉన్నతికి సంబంధించిన రికవరీలపై దృష్టి సారించాలన్నారు. మండల సంఘాల మధ్య జరిగిన లావాదేవీలకు సంబంధించిన రికవరీలను వేగవంతం చేయాలని ఆమె ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లోకో ప్రాజెక్టు 50 శాతం మాత్రమే పూర్తి అయిందని, 100 శాతం వేగంగా పూర్తి చేయాలన్నారు. ఈ లోకో దరఖాస్తులను ఆన్‌లైన్ చేసే సమయంలో ఆధార్ లింక్ చేయడం వల్ల ఒక వ్యక్తి మరో సంఘంలో ఉండే అవకాశం ఉండదని, దీనివల్ల బినామీ సభ్యుల బెడద ఉండదన్నారు. ఎన్నికల కారణంగా నాలుగు నెలలుగా మహిళా సంఘాల సభ్యులపై ఎటువంటి ఒత్తిడి తీసుకురాక పోవడం వల్ల బకాయిలు పెరిగి పోయాయన్నారు. కాకినాడ, తుని, ప్రత్తిపాడులో జనరిక్ మెడికల్ షాపులు ఉన్నాయని, వాటి నుంచి ఎందుకు సర్వీసు చార్జీలు వసూలు చేయడం లేదని పీడీ ప్రశ్నించారు. వెంటనే వసూళ్లు ప్రారంభించాలని ఆదేశించారు. గ్రామ, మండల మహిళా సమాఖ్యల ఆడిట్ పూర్తి అయిన తరువాత కార్యాలయంలో భద్రపర్చాలని సూచించారు. సమావేశానికి జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఐ.కాంచన అధ్యక్షత వహించగా కార్యదర్శి కె.సంధ్య, కోశాధికారి డి.నిర్మల, ఉపాధ్యక్షురాలు జి. కాంతం, సహాయ కార్యదర్శి వి.నూకరత్నం, స్త్రీ నిధి ఏజీఎం చిట్టిబాబు, ఐబీ డీపీఎం బాబురావు, ఫైనాన్సు డీపీఎం వెంకటేశ్వరరావు, హెచ్ఆర్ డీపీఎం అశోక్‌భరత్, జీవనోపాధుల డీపీఎం కేశవ్, బ్యాంకు లింకేజ్ డీపీఎం పద్మావతి, ఇన్సూరెన్సు ఏపీఎం వేదకుమారి, జిల్లాలోని 20 మండలాలకు చెందిన ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

కేంద్ర నిధులు.. గోదావరి పాలు

- రూ.5.45 కోట్లతో ఐలాండ్–5 అభివృద్ధి
- వరదలకు కొట్టుకుపోయిన నిర్మాణాలు
- చిట్టడవిని తలపిస్తున్న పర్యాటక ప్రాంతం

యానాం: సాధారణంగా ఒక ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలంటే అనేక రకాలుగా ఆలోచించాలి. అది ఎంత వరకూ సురక్షితం, ప్రజలకు ఉపయోగపడుతుందా, భవిష్యత్తులో ఏవైనా ఇబ్బందులు వస్తాయా అనే అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. ఇక కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టే పనులకు సంబంధించి పదింతలు ఆలోచన చేయాలి. కానీ అనాలోచితంగా, కంగారు చేసిన అభివృద్ధి పనులు ప్రజలకు ఉపయోగపడకపోగా, కోట్ల రూపాయల విలువైన ప్రజాధనం వృథా అవుతుంది. దీనికి యానాంలోని గౌతమీ గోదావరి మధ్యలోని ఐలాండ్–5 పర్యాటక కేంద్రం సాక్ష్యంగా నిలుస్తుంది.

స్వదేశీ దర్శన్ నిధులు

కేంద్ర ప్రభుత్వం 2014–15లో కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో టూరిస్ట్ సర్క్యూట్స్‌ను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో స్వదేశీ దర్శన్ పథకాన్ని ప్రారంభించింది. దానిలో భాగంగా సెంట్రల్ ఫైనాన్షియల్ అసిస్టెన్స్ (సీఎఫ్ఏ) ద్వారా పర్యాటక ప్రాంతాలలో మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో యానాంలోని గౌతమీ గోదావరిలో సహజ సిద్ధంగా 55.54 ఎకరాల్లో ఏర్పడిన దీవికి ఐలాండ్–5 అని పేరు పెట్టి, దాన్ని పర్యాటక స్థలంగా మార్చేందుకు స్వదేశీ దర్శన్ పథకం ద్వారా రూ.5.45 కోట్లను కేంద్రం మంజూరు చేసింది. ఆ దీవిలో నిర్మాణాల కోసం 2017లో టెండర్లు కూడా పిలిచారు. 2018లో నిర్మాణాలు ప్రారంభం కాగా, ఐలాండ్ చుట్టూ రివిట్‌మెంట్, స్తంభాలతో ఫెన్సింగ్, పర్యాటకులు కూర్చునేందుకు ఎత్తయిన వేదిక, సిమెంట్‌తో హట్‌ల నిర్మాణం, చిన్నపాటి సిమెంట్ దారులు నిర్మించారు.



ముళ్ల పొదల మధ్యలో సిమెంట్ బెంచీలు



ఐలాండ్‌లో పర్యాటకుల కోసం నిర్మించిన హట్



ఐలాండ్–5 లో వరదలకు కూలిపోయిన నిర్మాణాలు

వరదల నేపథ్యంలో..

ఐలాండ్–5 పర్యాటక ప్రాంతాన్ని ప్రారంభించిన కొద్దిరోజులకే నిర్మాణాలు గోదావరి వరదలకు కొట్టుకుపోయాయి. నిర్మాణాలు సరిగ్గా కట్టకపోవడంతో కూలిపోయాయి. అలాగే నీరు చాలా రోజుల వరకూ ఉండిపోవడంతో నిర్మాణాల కింద మట్టి నానిపోయి కట్టడాలు కూలిపోయాయి. దీంతో అక్కడకు ఎవరూ వెళ్లకపోవడంతో ఆ ప్రాంతం క్రమంగా చిట్టడవిలా మారిపోయింది. భారీగా ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. ప్రస్తుతం అక్కడ పెరిగిన గడ్డిని మేస్తూ గేదెలు మాత్రం కనిపిస్తున్నాయి. ఐలాండ్–5లో విద్యుత్ అవసరాల కోసం సోలార్ లైట్లు ఏర్పాటు చేశారు. రూ.లక్షల ఖర్చుతో ప్రత్యేక స్తంభాలను నిర్మించి, వాటికి 20 సోలార్ లైట్లను అమర్చారు. అయితే రక్షణ లేకపోవడంతో సోలార్ లైట్లను, ప్లేట్లను దొంగలు ఎత్తుకెళ్లిపోయారు. కొన్ని స్తంభాలు శిథిలమై నేలకొరిగాయి.

విచారణకు ఆదేశం

గోదావరి వరదలకు ఐలాండ్–5 మునిగిపోతుందని తెలిసినా అక్కడ నిర్మాణాలు చేపట్టి, కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారంటూ సోషల్ యాక్టివిస్ట్ సుంకర కార్తీక్ మద్రాసు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై కోర్టు స్పందించి విజిలెన్స్ ఎంక్వయిరీ చేసి నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవాలని సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్‌ను, పుదుచ్చేరి చీఫ్ సెక్రటరీలను ఆదేశించింది. ఇది జరిగి మూడేళ్లవుతున్నా ఇప్పటి వరకూ స్పందన లేదు. దీనికి తోడు కూనపురెడ్డి సత్యనారాయణ మూర్తి వేసిన కేసు ఆధారంగా 2021లో హైకోర్టు సీబీఐ, విశాఖ విభాగాన్ని విచారణకు సైతం ఆదేశించింది. కూలిపోయిన నిర్మాణాలు ఉన్నప్పటికీ పీడబ్ల్యూడీ అధికారులు కాంట్రాక్టర్లకు బిల్లులు చేయడం గమనార్హం.

అధికారుల్లో చలనం లేదు

నిధుల దుర్వినియోగంపై సీబీఐ విచారణకు మద్రాసు హైకోర్టు ఆదేశించింది. అయితే మూడేళ్లు అవుతున్నా అధికారుల్లో చలనం లేదు. విజిలెన్స్ అండ్ యాంటీ కరప్షన్ శాఖ అధికారులు సైతం విచారణ చేయకుండా చోద్యం చూస్తున్నారు. తప్పుడు నివేదికలతో కేంద్రం నుంచి నిధులు మంజూరు చేయించుకున్నారు.

– సుంకర కార్తీక్, సోషల్ యాక్టివిస్ట్, లాయర్, యానాం

క్లుప్తంగా

12 నుంచి పొగాకు విత్తనాల విక్రయం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్‌): 2024 –25 సీజన్‌కు ఎన్‌బీఎస్‌/ఎన్‌ఎల్‌ఎస్‌/ఎస్‌ఎల్‌ఎస్‌ రైతులకు రాజమహేంద్రవరంలోని కేంద్ర పొగాకు పరిశోధనా సంస్థ (సీటీఆర్‌ఐ) ద్వారా ఈనెల 12వ తేదీ నుంచి పొగాకు విత్తనాలను విక్రయిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్‌ డాక్టర్‌ మాగంటి శేషుమాధవ్‌ తెలిపారు. 12వ తేదీ ఉదయం 10 గంటల నుంచి సీటీఆర్‌ఐ లోనూ, 22వ తేదీ ఉదయం 10 గంటల నుంచి కందుకూరు కేంద్ర పొగాకు పరిశోధనా సంస్థ పరిశోధనా స్థానంలో ప్రారంభమవుతాయన్నారు. టీబీజీఆర్‌ పాస్‌బుక్‌ కలిగిన రైతులకు ప్రతి బ్యారన్‌కు 500 గ్రాముల చొప్పున కిలో రూ.1200కి, పొగాకు బోర్డు ద్వారా రిజిస్టర్‌ చేయించిన కమర్షియల్‌ నారుమడులకు సంబంధించిన రైతులకు కిలో విత్తనాలను రూ.1800 చొప్పున విక్రయిస్తామని తెలిపారు.

ఎర్ర కాలువలో యువకుడి మృతదేహం

పెదపూడి: అనపర్తిలోని కొత్తూరు జెడ్‌ బ్రిడ్జి వద్ద ఎర్ర కాలువలో గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభ్యమైందని అనపర్తి ఎస్సై–2 హనుమంతురావు తెలిపారు. ఎర్రకాలువలో మృతదేహం పై ప్రాంతాల నుంచి కొట్టుకు వచ్చిందన్నారు. యువకుడికి సుమారు 30 నుంచి 35 ఏళ్ల వయసు ఉంటుందని, నీలం రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంటు ధరించాడన్నారు. సుమారు 5.6 అడుగుల ఎత్తు ఉన్నాడన్నారు. వీఆర్వో కోసూరి రవి కుమార్‌ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఎస్‌ఈబీ కానిస్టేబుల్‌ మృతి



ఘటనాస్థలంలో చాంద్‌ బాషా మృతదేహం

చింతూరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): మారేడుమిల్లి – చింతూరు ఘాట్‌ రోడ్డులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చింతూరు ఎస్‌ఈబీ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఎండీ చాంద్‌ బాషా (52) మృతి చెందారు. తులసిపాక సమీపంలో ఘాట్‌ రోడ్డులో వ్యూ పాయింట్‌ వద్ద రహదారి పక్కన చాంద్‌ బాషా మృతదేహం పడి ఉండడాన్ని గమనించిన ప్రయాణికులు 108కు సమాచారమివ్వడంతో విషయం తెలిసింది. చింతూరు నుంచి విధుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై మారేడుమిల్లి వైపు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగినట్లు ఎస్‌ఈబీ ఎస్‌ఐ ప్రసాద్‌ తెలిపారు. చాంద్‌ బాషా కాకినాడకు చెందిన వారన్నారు.

పుడమి తల్లికి పెనుభారం

- వివరీతంగా పెరుగుతున్న జనాభా
- ప్రపంచంలో మొదటి స్థానంలో మన దేశం
- తరిగిపోతున్న వనరులు
- రేపు ప్రపంచ జనాభా దినోత్సవం



అలమూరు: ప్రతి దేశానికి జనాభా అనేది అత్యవసరం. వీరితోనే ఆ దేశ ప్రగతి ఆధారపడి ఉంటుంది. కానీ అదే జనాభా పరిమితికి మించితే అనేక అనర్థాలు కలుగుతాయి. దేశ అభివృద్ధి కుంటుపడుతుంది. ప్రజలందరికీ వసతులు కల్పించడం ప్రభుత్వానికి భారంగా మారుతుంది. ప్రస్తుతం చైనాను దాటి మనం జనాభాలో నంబర్‌ వన్‌ స్థానంలో ఉన్నాం. స్వాతంత్ర్యోద్యమం సమయానికి దేశ జనాభా కేవలం 35 కోట్లు. ఇప్పుడు 75 ఏళ్ల తర్వాత అది నాలుగు రెట్లు పెరిగింది. వేగంగా పెరుగుతున్న జనాభాను నియంత్రించినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుంది. గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

వసతుల కొరత

దేశంలో రోజురోజుకూ పెరుగుతున్న జనాభా, కరిగిపోతున్న వనరులతో ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన తలనొప్పిగా మారుతోంది. అందరికీ **ఆహారాన్ని అందించడం, ఉపాధిని కల్పించడం, అవసరాలు తీర్చడం కష్టతరమవుతోంది. అధిక జనాభా వల్ల అడవులు తరిగిపోతుండగా, పంట భూములు ఆవాస ప్రాంతాలుగా మారిపోతున్నాయి. దీనివల్ల పర్యావరణంలో సమతుల్యత లోపించి భవిష్యత్తులో** పుడమికి ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని సామాజిక వేత్తలు ఆందోళన చెందుతున్నారు. ప్రతి ఏటా జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించుకోవడం ఆనవాయితీ. 1987 జూలై 11 నాటికి ప్రపంచ జనాభా ఐదు మిలియన్లకు చేరడంతో అప్పటి నుంచి ఆ రోజును జనాభా దినోత్సవం నిర్వహిస్తున్నారు.

2011 జనాభా గణాంకాలు

జాతీయ జనాభా 2011 గణాంకాల ప్రకారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 51,54,296 మంది ఉన్నారు. వారిలో **25,69,888 మంది పురుషులు, 25,84,608 మంది స్త్రీలు ఉన్నారు. అయితే 2024 మార్చి 31 నాటికి కేంద్ర ప్రభుత్వం 54.24 లక్షల మంది జనాభా ఉందని అంచనా** వేసింది. ఉమ్మడి జిల్లాను పరిపాలనా సౌలభ్యం కోసం గత వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం 2022 ఏప్రిల్‌ నాలుగున మూడు జిల్లా**లుగా విభజించింది. దీంతో పశ్చిమ గోదావరి జిల్లా నుంచి మూడు నియోజకవర్గాలు ప్రస్తుత తూర్పు గోదావరి జిల్లాలో విలీనమయ్యాయి. రంపచోడవరం నియోజకవర్గం అల్లూరి సీతారామరాజు జిల్లాలో కలిసింది. దీంతో జనాభా గణాంకాల్లో** తీవ్రమైన వ్యత్యాసం ఏర్పడింది.

నియంత్రణకు చర్యలు

దేశంలో పెరుగుతున్న జనాభా నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందనే పలువురు నిపుణులు, మేధావులు చెబుతున్నారు. జనాభా పెరుగుదల వల్ల కలిగే దుష్పరిణామాలను ప్రజలకు వివరించేందుకు ప్రసార మాధ్యమాల్లో విస్తృత ప్రచారం కల్పించాలి. కుటుంబ నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసి ప్రోత్సాహకాలను అందజేయాలి. వివాహం చేసుకున్న ప్రతి జంటా స్వచ్ఛంద నియంత్రణ పాటించాల్సిన అవసరం ఉంది. జనాభాను నియంత్రిస్తే పేదరికం తగ్గిపోతుంది.

ప్రపంచ జనాభా 795.09 కోట్లు

ప్రపంచంలో ప్రస్తుతం 795.09 కోట్ల మంది జనాభా ఉన్నారు. మన దేశ జనాభా 144.41 కోట్లు కాగా, రాష్ట్రంలో 5.35 కోట్లుగా ఉంది. గతంలో అధిక జనాభా కలిగే ఉండే చైనాను ప్రస్తుతం మన దేశం దాటేసింది. గత ఏడాది ఐక్యరాజ్య సమితి విడుదల చేసిన అంచనా నివేదిక ప్రకారం చైనా జనాభా 142.5 కోట్లు కాగా, మన దేశ జనాభా 142.8 కోట్ల మంది. అయితే భూభాగం పరంగా చైనా 95.97 లక్షల కిలోమీటర్ల విస్తీర్ణంతో విశాలంగా ఉండగా, మన దేశం 32.87 లక్షల విస్తీర్ణంలో మాత్రమే ఉంది. దీంతో జనాభా పరంగా అధికంగా, విస్తీర్ణం పరంగా తక్కువగా ఉండటంతో ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన కష్టంగా మారుతోంది. జీవ వైవిధ్యానికి తీవ్ర నష్టం వాటిల్లడంతో పాటు ప్రధాన నగరాలు, పట్టణాల్లో వాయు కాలుష్యం పెరిగి పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటోంది.

జనాభా వివరాలు

జిల్లా	జనాభా	పురుషులు	స్త్రీలు	వైశాల్యం
డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ కోనసీమ	17,19,013	8,58,632	8,60,381	2083 కి.మీ
కాకినాడ	20,92,374	10,45,269	10,47,105	3020 కి.మీ
తూర్పుగోదావరి	18,32,332	9,15,325	9,17,007	2561 కి.మీ
మొత్తం	56,43719	28,19,226	28,24,493	5581 కి.మీ

విస్తృత అవగాహన



దేశంలో జనాభా నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై విస్తృత అవగాహన కల్పిస్తున్నాం. జనాభా పెరుగుదల వల్ల కలిగే అనర్థాలను క్షేత్రస్థాయి వైద్యారోగ్య సిబ్బంది సమగ్రంగా వివరిస్తున్నారు. జనాభా నియంత్రణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలి.

– ఆర్‌.మల్లికార్జున్‌, పీహెచ్‌సీ వైద్యాధికారి, రాజమహేంద్రవరం

చిన్న కుటుంబంతో మేలు



చిన్న కుటుంబం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరిస్తున్నాం. కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సను ప్రోత్సహిస్తున్నాం. మహిళలకు ట్యూబెక్టమీతో పాటు పురుషులు చేయించుకునే వేసెక్టమీల పెరుగుదలకు కృషి చేస్తున్నాం.

– వి.సువర్చల, ఎంఎల్‌హెచ్‌పీ, చింతలూరు, ఆలమూరు మండలం

నియంత్రిస్తేనే భవిష్యత్తు



పెరుగుతున్న జనాభాను నియంత్రించడం ద్వారానే భవిష్యత్తులో సమాజానికి మనుగడ ఉంటుంది. నియంత్రణ బాధ్యతను ప్రభుత్వాలే కాదు ప్రజలు కూడా స్వీయ ఆచరణలో పాటించనప్పుడే సాధ్యమవుతుంది. దీని ద్వారా భావితరాలకు పరిమితంగా ఉన్న వనరులను సమగ్రంగా అందించవచ్చు.

– గంటా రామారావు, ప్రధానోపాధ్యాయుడు, కోరుమిల్లి, కపిలేశ్వరపురం మండలం.

అక్రమ కబేళాలు నిర్వహిస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కాకినాడ ఆర్డీవో కిషోర్‌

పిఠాపురం: అక్రమ కబేళాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్‌ హెచ్చరించారు. ఆయన మంగళవారం నియోజకవర్గంలో అక్రమ కబేళాలు, పశు రవాణా, విక్రయాలకు సంబంధించి రెవెన్యూ, పంచాయతీ, పశుసంవర్ధక, పోలీస్‌ శాఖలతో పిఠాపురం మున్సిపల్‌ కార్యాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో అక్రమ కబేళాలు నిర్వహిస్తున్నారంటూ ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో ఈ సమావేశం నిర్వహించామన్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఇటువంటి వాటిని నిర్వహించకూడదన్నారు. వీటిని అరికట్టడానికి గ్రామస్థాయిలో రెవెన్యూ పంచాయతీ, పశుసంవర్ధక, పోలీసుశాఖ సిబ్బంది సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో ఉప్పాడ, కొత్తపల్లి, గొల్లప్రోలు, పిఠాపురం మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పోలీసు అధికారులు, పశుసంవర్ధకశాఖ అధికారులు, పిఠాపురం మున్సిపల్‌ కమిషనర్‌ కనకారావు. సర్కిల్‌ ఇన్‌స్పెక్టర్‌ జి శ్రీనివాస్‌, మాంసం విక్రయిదారులు పాల్గొన్నారు.

అన్నవరానికి రెండు కొత్త బస్సులు

- రూ.80 లక్షలతో కొనుగోలు చేయనున్న దేవస్థానం
- భక్తులకు తీరనున్న రవాణా కష్టాలు



రత్నగిరిపై పశ్చిమ రాజగోపురం వద్ద ఉన్న దేవస్థానం బస్సులు

అన్నవరం: సత్యదేవుని ఆలయానికి విచ్చేసే భక్తుల కోసం అన్నవరం దేవస్థానం రెండు కొత్త బస్సులను కొనుగోలు చేయనుంది. ఒక్కో బస్సులో 42 మంది కూర్చునేందుకు సీట్లు కలిగిన వీటి కోసం రూ.80 లక్షలు వెచ్చించనున్నట్టు దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్‌ తెలిపారు. అశోక్‌ లైలాండ్‌ కంపెనీకి చెందిన ఈ బస్సులు ఆగస్టు నెలాఖరుకు అందుబాటులోకి రానున్నాయి.

పెద్దసంఖ్యలో భక్తుల రాక

అన్నవరం దేవస్థానానికి నిత్యం వేల సంఖ్యలో భక్తులు తరలివస్తారు. పర్వదినాలలో 50 వేల నుంచి లక్ష మంది, సాధారణ రోజులలో పది వేల నుంచి 30 వేల వరకూ మంది వరకూ ఉంటారు. భక్తుల కోసం అన్నవరం దేవస్థానం ఏడు బస్సులను నడుపుతోంది. వాటిలో రెండు బస్సుల కండిషన్‌ అంతంత మాత్రంగా ఉంది. మిగిలిన వాటిలో మూడు బస్సులు రైల్వేస్టేషన్‌ నుంచి రత్నగిరికి, మిగిలిన రెండు బస్సులు కొండ దిగువ నుంచి రత్నగిరికి తిరుగుతాయి. అలాగే సుమారు వంద ఆటోలు రైల్వేస్టేషన్‌ నుంచి రత్నగిరి మధ్య రాకపోకలు సాగిస్తూ ఉంటాయి.

దేవస్థానానికి ఆదాయం

ప్రధానంగా రైళ్లలో అన్నవరం వచ్చిన భక్తులు దేవస్థానం బస్సులతో పాటు ఆటోల ద్వారా సత్యదేవుని ఆలయానికి చేరుకుంటారు. ఒక రైలులో వచ్చిన సుమారు 500 మంది అన్నవరం రైల్వేస్టేషన్‌లో దిగితే.. వారికి కేవలం మూడు దేవస్థానం బస్సులు మాత్రమే అందుబాటులో ఉంటున్నాయి. అలాగే దేవస్థానం బస్సులో రత్నగిరికి ఒక్కొక్కరికీ రూ.20 టిక్కెట్‌ వసూలు చేస్తున్నారు. అదే ఆటోలలో అయితే ఒక్కొక్కరికీ రూ.50 చెల్లించాలి. ట్రాన్స్‌పోర్టు ద్వారా గత ఆర్థిక సంవత్సరంలో దేవస్థానానికి రూ.1.76 కోట్ల ఆదాయం వచ్చింది. కొత్త బస్సులను రైల్వేస్టేషన్‌ నుంచి రత్నగిరికి నడిపితే మరింత పెరిగే అవకాశం ఉంటుంది.

ఆగస్టు చివరకు అందుబాటులోకి..



రెండు కొత్త బస్సులను రూ.80 లక్షలతో కొనుగోలు చేస్తున్నాం. ఇవి ఆగస్టు నెలాఖరుకు భక్తులకు అందుబాటులోకి వస్తాయి. కొత్త బస్సులు వచ్చాక, తరచూ మరమ్మత్తులకు గురవుతున్న రెండు పాత బస్సులను విక్రయించే ఆలోచన ఉంది.

– కె.రామచంద్రమోహన్‌, ఈఓ, అడిషనల్‌ కమిషనర్‌

డ్వాక్రా యానిమేటర్‌ అవకతవకలపై విచారణ

పిఠాపురం: బి.కొత్తూరు గ్రామంలో డ్వాక్రా సంఘాల యానిమేటర్‌ కోట్లాది రూపాయలు కాజేసినట్లు వచ్చిన ఆరోపణలపై మంగళవారం అధికారులు విచారణ చేపట్టారు. దీనిపై ఇటీవల పిఠాపురంలో ఏర్పాటు చేసిన ప్రజా పరిష్కార వేదికలో ఐదు గ్రూపులకు చెందిన ఆరుగురు సభ్యులు ఫిర్యాదు చేశారు. దీంతో డీఆర్‌డీఏ అధికారులు ఆ గ్రామంలో డ్వాక్రా మహిళలను విచారణ చేశారు. ఆ గ్రామంలో 58 డ్వాక్రా సంఘాలు ఉన్నాయి. పిఠాపురానికి చెందిన దారా పద్మకుమారి ఆ గ్రామానికి డ్వాక్రా సంఘాల యానిమేటర్‌గా పని చేస్తున్నారు. ఆమె చైతన్య గోదావరి, బ్యాంక్‌ ఆఫ్‌ బరోడా, మరొక బ్యాంకు నుంచి డ్వాక్రా గ్రూపులను ఏర్పాటు చేశారు. ఆ గ్రామానికి చెందిన వారు కాకుండా ఇతర ప్రాంతాలకు చెందిన వారిని వాటిలో సభ్యులుగా చేర్చారు. బ్యాంకులలో సుమారు రూ. 6 కోట్ల నుంచి రూ.8 కోట్లు రుణాలు తీసుకున్నారు. సుమారు మూడేళ్లుగా ఈ అక్రమాలకు పాల్పడినట్లు ఫిర్యాదుదారులు చెబుతున్నారు. తీసుకున్న రుణాలను చెల్లించాలని బ్యాంక్‌ ఆఫ్‌ బరోడా బ్రాంచ్‌ మేనేజర్‌ స్వామి ఇటీవల డ్వాక్రా సభ్యులను అడగడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

30 సంఘాల సభ్యుల విచారణ

డీఆర్‌డీఏ డీపీఎం వి.పద్మావతి, పిఠాపురం వెలుగు ఏపీఎం సీహెచ్‌ ప్రియదర్శిని ఆ గ్రామాల్లోని సుమారు 30 సంఘాలకు చెందిన 300 మంది మహిళలను విచారణ చేశారు. దాదాపు 15 గ్రూపులు సక్రమంగానే రుణాలు తీసుకున్నట్లు గుర్తించారు. మరో 15 గ్రూపుల సభ్యులు మాత్రం తాము రుణాలు తీసుకోలేదని వెల్లడించారు. దీనిపై బ్యాంకు మేనేజర్‌ స్వామి ఇటీవల పద్మకుమారి నుంచి రూ.50 లక్షలు రికవరీ వసూలు చేసినట్లు వెలుగు ఏపీఎం ప్రియదర్శిని తెలిపారు. విచారణలో సుమారు రూ.60 లక్షలు అక్రమంగా రుణాలు పొందినట్లు గుర్తించామన్నారు. మరి కొందరిని విచారణ చేస్తే పద్మకుమారి ఎంత మొత్తంలో అక్రమాలకు పాల్పడిందనే విషయం తెలుస్తుందన్నారు.

25 టన్నుల రేషన్‌ బియ్యం సీజ్‌



రైసుమిల్లులో రేషన్‌ బియ్యాన్ని స్వాధీనం చేసుకుంటున్న విజిలెన్స్‌ అధికారులు

కోటనందూరు: స్థానిక మహాలక్ష్మి రైస్‌మిల్లులో విజిలెన్స్‌, రెవెన్యూ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. రాజమహేంద్రవరం విజిలెన్స్‌ ఎస్పీ కేఎస్‌ఎస్‌వీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడిలో 25.3 టన్నుల రేషన్‌ బియ్యాన్ని గుర్తించారు. ఈ బియ్యాన్ని కేజీ రూ.20కు రైస్‌మిల్లు నిర్వాహకులు కొనుగోలు చేసి, రూ.23కు ఛత్తీస్‌గఢ్‌కు లారీలో తరలిస్తున్నట్లు గుర్తించారు. ఈ మోసానికి పాల్పడుతున్న పోతల రాంబాబు, శెట్టి శ్రీనివాసరావు, కోన ప్రభుదాసు, మోహన్‌లాల్‌ యాదవ్‌, ఆనంద్‌ దేవాంగన్‌పై క్రిమినల్‌ కేసుల నమోదుకు కోటనందూరు పోలీసు స్టేషన్‌కు సిఫారసు చేశారు. అలాగే 25.3 టన్నుల రేషన్‌ బియ్యం, లారీ, నాలుగు ఎలక్ట్రికల్‌ కాటాలు, 1400 కిలోల ఫోర్టిఫైడ్‌ రైస్‌, 12,300 కిలోల బియ్యం, 3,750 కిలోల ధాన్యం, 1,500 కిలోల బ్రోకెన్‌ రైస్‌, 1,050 కిలోల రైస్‌బ్రాన్‌ను సీజ్‌ చేసినట్లు అధికారులు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.40,93,548 ఉంటుందన్నారు. విజిలెన్స్‌ ఎస్పీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ రేషన్‌ బియ్యాన్ని ఎవరైనా కొనుగోలు చేసినా, నిల్వ ఉంచినా, రవాణా చేసినా కఠినమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. దాడిలో విజిలెన్స్‌ ఎస్సై జగన్నాథరెడ్డి, ఏఓ భార్గవ మహేష్‌, ఏజీ లక్ష్మీ నారాయణ, డీసీటీఓ నవీన్‌ కుమార్‌ పాల్గొన్నారు.

జల్సాల కోసం చోరీల బాట



నిందితుడి వివరాలు తెలియజేస్తున్న తూర్పు మండల డీఎస్పీ కిశోర్‌ కుమార్‌

- పోలీసులకు చిక్కిన యువకుడు
- రూ.15 లక్షల విలువైన సొత్తు స్వాధీనం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): చోరీలు చేసిన తండ్రిని ఆదర్శంగా తీసుకున్న ఆ యువకుడు తాను కూడా నేరాల బాట పట్టి పోలీసులకు చిక్కాడు. దిశ పోలీస్‌ స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ ఎం.కిశోర్‌ కుమార్‌ ఆ వివరాలు తెలిపారు. కొంతమూరు ప్రాంతానికి చెందిన కొండేటి సాయి పదో తరగతి వరకూ చదువుకున్నాడు. గతంలో ఓ సంస్థలో పనిచేసేవాడు. అనంతరం జల్సాలకు అలవాటు పడ్డాడు. గతంలో అతడి తండ్రి రాంబాబు చోరీలు చేసి పలుమార్లు పోలీసులకు చిక్కాడు. అయితే రాంబాబు కరోనా సమయంలో మృతి చెందాడు. తండ్రి నేరవృత్తిని ఆదర్శంగా తీసుకున్న సాయి తాను కూడా సులువుగా డబ్బు సంపాదించాలంటే దొంగతనమే మేలని భావించాడు. ఈ నేపథ్యంలో 2017లో రాజమహేంద్రవరం, రాజానగరం, అంబాజీపేట, సామర్లకోట, సికింద్రాబాద్‌ రైల్వేస్టేషన్లలో పలు దొంగతనాలకు పాల్పడ్డాడు. 2023 జూలై నుంచి ఇప్పటి వరకూ ఆరు దొంగతనాలు చేశాడు. ఇటీవల జిల్లాలో జరుగుతున్న నేరాలపై నిఘా పెట్టిన పోలీసులు.. పాత నేరస్తుడు అయిన కొండేటి సాయి కదలికలను పరిశీలించారు. అతడిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా చోరీల చిట్టా బయట పెట్టాడు. సాయి నుంచి రూ.13,14,400 విలువైన బంగారు ఆభరణాలు, రూ.1.35 లక్షల విలువైన వెండి ఆభరణాలు, రూ.90 వేలు, చోరీలకు ఉపయోగిస్తున్న మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి నుంచి సొత్తు రికవరీ చేయడంలో ప్రతిభ కనపర్చిన బొమ్మూరు సీఐ ఎండీ ఉమర్‌, ఎస్సై బి.శ్రీను, ఆర్‌.అంకారావు, ఏఎస్సై కె.సత్యనారాయణ, హెడ్‌ కానిస్టేబుల్‌ పి.వెంకటేశ్వరావు, కానిస్టేబుల్‌ సురేష్‌ బాబులను ఎస్పీ అభినందించారు.

దామాషా పద్ధతిలో ఎన్నికలు జరగాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌పీఐ రాష్ట్ర అధ్యక్షుడు డీబీ లోక్‌

అమలాపురం టౌన్‌: ప్రస్తుత ఎన్నికల విధానం లోపభూయిష్టంగా ఉందని, ప్రతి ఓటుకూ ఒకే విలువ ఉండే సిద్ధాంతం దిశగా దామాషా పద్ధతిలోనే ఎన్నికలు జరగాలని రిపబ్లికన్‌ పార్టీ ఇండియా (ఆర్‌పీఐ) రాష్ట్ర అధ్యక్షుడు డీబీ లోక్‌ అన్నారు. స్థానిక అరిగెలపాలెంలో మంగళవారం సాయంత్రం జరిగిన ఆర్‌పీఐ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పోలైన ఓట్లను పరిశీలిస్తే 50 శాతం ఓట్లు వచ్చిన టీడీపీ కూటమి విజయం సాధిస్తే, 40 శాతం ఓట్లు వచ్చిన వైఎస్సార్‌ సీపీ ఓటమి పాలైందన్నారు. ఈ తరహా ఎన్నికల సరళి ప్రజాస్వామ్య విధానానికి విరుద్ధమని ఆందోళన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌ సీపీకి వచ్చిన 40 శాతం ఓట్లకు విలువ లేకుండా పోయిందన్నారు. దీనివల్ల వన్‌ మ్యాన్‌ వన్‌ ఓటు అండ్‌ వన్‌ వాల్యూ విధానానికి భంగం కలుగుతోందన్నారు. దామాషా పద్ధతిలో నిర్వహించినట్లయితే వైఎస్సార్‌ సీపీ రాష్ట్రంలో ఎక్కువ సీట్లు తెచ్చుకునేదని స్పష్టం చేశారు. ఆ విధానంలో పోలైన మొత్తం ఓట్లను ఏఏ పార్టీలకు ఎన్నెన్ని ఓట్లు వచ్చాయో లెక్క కడతారని, దాని బట్టి ఎమ్మెల్యే సీట్లను నిర్ణయించే అవకాశం ఉంటుందన్నారు. తద్వారా అన్ని పార్టీలకు ప్రాతినిధ్యం సాధ్యమవుతుందన్నారు. ప్రతి ఓటుకు విలువ ఉంటుందని అభిప్రాయపడ్డారు.

రూ.62 లక్షలు దాటిన జి.యర్రంపాలెం స్కామ్‌



జి.యర్రంపాలెంలోని బ్యాంక్‌ ఆఫ్‌ బరోడా శాఖ

రాజానగరం: జి.యర్రంపాలెంలోని బ్యాంక్‌ ఆఫ్‌ బరోడా శాఖలో బిజినెస్‌ కరస్పాండెంట్‌ (బీసీ) నాని బాబు చేసిన అవినీతిపై డీఆర్‌డీఏ చేపట్టిన విచారణ దాదాపుగా పూర్తి కావొచ్చినట్టు తెలుస్తుంది. ఈ బ్యాంకు పరిధిలోని కొండగుంటూరు, నామవరం, పుణ్యక్షేత్రం, నామవరం, భూపాలపట్నం గ్రామాలలో సుమారు 116 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వాటిలోని 109 సంఘాల ప్రతినిధులను అధికారులు విచారణ చేసి, ఆధారాలను పరిశీలించారు. మొత్తానికి రూ.62 లక్షలకు పైబడి స్కామ్‌ జరిగినట్టు ఉన్నతాధికారులకు తొలి నివేదిక అందించారు. అయితే ఇంకా ఏడు సంఘాలను విచారించాల్సిన ఉందని, అది కూడా పూర్తయితే ఈ మొత్తం మరింత పెరిగే అవకాశం ఉందని డ్వాక్రా మహిళలు చెబుతున్నారు. అలాగే ప్రస్తుతం విచారణంతా రెండు, మూడు సంవత్సరాలకే జరుగుతోందని, కానీ ఇదే వ్యక్తి (బీసీ నానిబాబు)కి గతంలో కూడా సొమ్ములు ఇచ్చామని, అవైనా సక్రమంగా బ్యాంకు ఖాతాలకు వెళ్లాయో, లేదోననే అనుమానం కలుగుతుందన్నారు. ఈ కారణంగా పాత రికార్డులు కూడా పరిశీలించాలని డిమాండ్‌ చేస్తున్నారు. కాగా.. బంగారం, వ్యవసాయ రుణాలకు సంబంధించిన విచారణ బ్యాంకు పరంగా జరుగుతోంది. ఇది ఎన్ని లక్షల రూపాయలు ఉంటుందనే విషయాన్ని బ్యాంకు అధికారులు చెప్పడానికి ఇష్టపడటం లేదు.

కొండచిలువ హతం

నల్లజర్ల: అనంతపల్లి శివారు సంజీవపురం వద్ద తాడిపూడి కాలువలో తూడు తొలగిస్తున్న ఉపాధి హామీ కూలీలకు మంగళవారం 13 అడుగుల కొండ చిలువ కనపడింది. అది చూసి వారందరూ పరుగులు తీశారు. అనంతరం గునపాలు, కర్రలు తీసుకువచ్చి కొండచిలువను హతమార్చారు. గోదావరికి వరద రావడంతో ఎగువ ప్రాంతంలో ఉన్న విషసర్పాలు, కొండచిలువలు, పాములు దిగువకు కొట్టుకు వస్తున్నాయని ఉపాధి కూలీలు తెలిపారు. ఎత్తిపోతల పథకం ద్వారా తాడిపూడి కాలువకు వచ్చిన నీటిలో కొండచిలువ కొట్టుకు వచ్చి ఉంటుందని భావిస్తున్నారు.